కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

- కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్
- 22 ఏళ్ల కల సాకారం
- జీవితాంతం జగనన్నకు రుణపడి ఉంటాం
- సీఎం జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేసిన వైద్య సిబ్బంది

కోసిగి: కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేసి వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి జీవితాంతం రుణ పడి ఉంటామని హెల్త్ అసిస్టెంట్స్ మధుమతి, ఆశాలత, సులోచన, కృపానందం, బలరాం, నాగలక్ష్మీ, నరసమ్మ పేర్కొన్నారు. బుధవారం కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో రెగ్యూలర్ అయిన హెల్త్ అసిస్టెంట్స్‌తో కలిసి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య ఆరోగశాఖలో 22 ఏళ్లకుపైగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 30, 31లను విడుదల చేసిందన్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో 196 మందిని రెగ్యూలర్ చేస్తూ ఆదేశాలు జారి అయ్యాయని తెలిపారు. ఆరోగ్య శాఖలో ఎంపీహెచ్ఈఓలు, ఫార్మాసిస్టలు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఈసీ ఏఎన్ఎమ్‌లు, ఓపీ ఏఎన్ఎమ్‌లు ఉన్నారన్నారు. కోసిగి మండలంలో ఒక పార్మసిస్ట్, ఆరుగురు మగ, మహిళ ఏఎన్ఎమ్‌లు రెగ్యూలర్ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు. తమ జీవితాల్లో వెలుగు నింపిన సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.


సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కోసిగి వైద్యాధికారులు, వైద్య సిబ్బంది

2003 నుంచి ఎదురుచూశా



2003లో విధుల్లో చేరాను. కోసిగి ఏఎన్ఎమ్‌గా పనిచేస్తున్నారు. జీవితంలో రెగ్యూలర్ కాలేమని.. మా బతుకులు ఇంతే ననుకున్నా. కానీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉద్యోగాలను రెగ్యూలర్ చేసి మా జీవితాల్లో వెలుగులు నింపారు. జీవితాంతం రుణపడి ఉంటాం.

–మధుమతి, ఏఎన్ఎమ్, కోసిగి

ఉద్యోగం వదిలేద్దామనుకున్నా



కాంట్రాక్ట్ పద్ధతిన కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్‌గా 2002లో విధుల్లో చేరాను. నాటి నుంచి ఉద్యోగాలను రెగ్యూలర్ చేయాలని విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. ఇక రెగ్యూలర్ కాదని ఉద్యోగం వదిలేద్దామనుకున్నాను. ఇంతలో సీఎం జగన్ మా ఉద్యోగాలను రెగ్యూలర్ చేసి కొత్త ఆశలను రెకెత్తించారు.

–సులోచన, ఫార్మసిస్ట్, కోసిగి పీహెచ్‌సీ

రుణపడి ఉంటాం



మాది రుద్రవరం మండలం. 2003లో కాంట్రాక్ట్ ఉద్యోగం కింద హెల్త్ అసిస్టెంట్‌గా చేరాను. భార్య పిల్లలతో కోసిగిలో అద్దెకు ఇళ్లు తీసుకుని జీవనం సాగిస్తున్నాను. తక్కువ జీతంతో చాలా ఇబ్బందులు పడ్డాను. ఎన్నికల్లో సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యూలర్ చేశారు. మా కష్టాలు నుంచి గట్టెక్కించిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

–బలరాం, హెల్త్ అసిస్టెంట్

చాలా సంతోషం



కాంట్రాక్ట్ పద్ధతిన 17 ఏళ్ల నుంచి పనిచేస్తున్నాను. చాలీ చాలని జీతాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యూలర్ చేస్తూ జీవో విడుదల చేయడం ఆనందంగా ఉంది.

–కృపావరం, హెల్త్ అసిస్టెంట్

క్లుప్తంగా

కుంబళనూరు క్యాంపులో రోడ్డు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కౌతాళం: మండల పరిధిలోని కుంబళనూరు క్యాంపు–2లో సిమెంటు రోడ్డు పనులకు బుధవారం భూమి పూజ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌కుమార్, బుచ్చిరాజు మాట్లాడుతూ.. క్యాంపులోని బీసీ కాలనీలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షల గడప గడప నిధులు మంజూరు కావడంతో పనులకు ప్రారంభించినట్లు తెలిపారు. మరో రూ.5 లక్షలతో క్యాంపు–1లో పనులు ప్రారంభిస్తామన్నారు. గడప గడప నిధులతో గ్రామంలోని ప్రధాన వీదుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


గర్భిణులకు సీమంతం చేస్తున్న ఎంపీపీ

పెద్దకడబూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ శ్రీవిద్య, సీడీపీఓ నాగమణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో బుధవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు చేశారు. చిరుధాన్యాల వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందాలంటే ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఫిరదౌస్,అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు


సంక్షేమ పథకాల వివరాలను తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిరూరల్: అర్హత కలిగిన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్ పేర్కొన్నారు. బుధవారం మేజర్ పంచాయతీ మండిగిరిలోని తిరుమల నగర్‌లో గడప గడపకు సంక్షేమం పేరుతో పథకాల లబ్ధి గురించి ఇంటింటికీ తిరిగి వివరించి ప్రజలకు గుర్తు చేశారు. అందరికీ మేలు చేస్తున్న జగనన్నను మళ్లీ గెలిపించాలని కోరారు.

వృద్ధుడికి గాయాలు


గాయపడిన వృద్ధుడు

ఆదోనిసెంట్రల్: ఆదోని–నగరూరు రైల్వే స్టేషన్‌ల మధ్య కి.మీ. 492/9–11 వద్ద అప్ లైన్ ట్రాక్ పక్కన బుధవారం ఓ వృద్ధుడు అనారోగ్యంతో కింద పడి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి 108 అంబులెన్స్‌లో ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కానిస్టేబుల్ మాట్లాడుతూ తన పేరు హనుమంతు అని, కోసిగిలోని వడ్డేగేరి ప్రాంతమని, తనకు నలుగురు కుమార్తెలున్నారని చెప్పాడన్నారు. తెలిసిన వారు ఆదోని ఏరియా ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు.

మతసామరస్యం


ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్న మండిగిరి కాలనీవాసులు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని 19వ వార్డు మండిగిరి కాలనీలో వెలిసిన షాకీరా దర్గాలో కాలనీ వాసులు స్థానిక ముస్లింలకు బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. శ్రీనివాస ఆచారి ఆధ్వర్యంలో పవిత్రమైన రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసం దీక్ష ఆచరిస్తున్న వారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి మత సామరస్యాన్ని చాటుకున్నారు. ఈరన్న, రవి, నరేంద్ర, అల్లప్ప, రామదాసు పాల్గొన్నారు.

నేడు కౌతాళంలో వైద్య శిబిరం

కౌతాళం: మండల కేంద్రంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. ఆదోని మధు హాస్పిటల్ వైద్యులు అరుణ, దేవన్నగౌడ్‌లు గుండె, ఎముకలకు సంబంధిత సమస్యలకు పరీక్షలు చేస్తారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భర్తను హత్యచేసిన భార్య

ఓబులవారిపల్లె: అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేట పునరావాస కాలనీ –1లో బుధవారం తెల్లవారుజామున బోయ తిమ్మప్ప (40) అనే వ్యక్తిని భార్య నరసమ్మ హత్య చేసింది. పోలీసుల కథనం మేరకు.. కర్నులు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన బోయ తిమ్మప్పకు మంగంపేటకు చెందిన నరసమ్మతో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. పునరావాస కాలనీలో నివాసం ఉంటున్నారు. భార్య నరసమ్మ మంగంపేటలోని ఏపీఎండీసీలో ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తుంది. తిమ్మప్ప బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తాగి ఇంటికిరాగా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. నరసమ్మ ఆవేశంతో పక్కనున్న ఇనుప రాడ్డు తీసుకుని తిమ్మప్ప తలపై పలు మార్లు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్‌ఐ చిన్న పెద్దయ్య నరసమ్మను అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వేకొడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

హొళగుంద: కోగిలతోట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హొళగుంద పీహెచ్‌సీ డాక్టర్లు బింధుమాధవి, న్యూటస్ వైద్య పరీక్షలు నిర్వహించారు. జాతీయ అయోడిన్ లోప రుగ్మతల నియంత్రణ కార్యక్రమం (ఎన్ఐడీడీసీపీ)లో భాగంగా థైరాయిడ్ సమస్య, గొంతునొప్పి విటమిన్ లోపాలు తదితర వ్యాధులను గుర్తించడానికి 9 మందికి యూరిన్, 18 మందికి సాల్ట్ శాంపుల్స్‌ను సేకరించినట్లు డాక్టర్లు తెలిపారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ

మంత్రాలయం: మండలంలో రూ.1.50కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను చేపడుతున్నట్లు టీటీడీ పాలక మండలి సభ్యుడు వై. సీతారామిరెడ్డి తెలిపారు. బుధవారం సూగూరు గ్రామ శివారులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ సమీపంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. మంత్రాలయం మండలంలోని సూగూరు, బూదూరు, వి.తిమ్మాపురం, వగరూరు, సౌళ్ల హళ్లి, సుంకేశ్వరి, రచ్చుమర్రి, మాధవరం గ్రామాలకు లోవోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అధికారులు తెలిపారు.


భూమి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు

కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈలు ఓబులేష్, రాజశేఖర్, ఏడీలు ఎల్లప్ప, శాంతి స్వరూప్, ఏఈలు గోవిందు, కొండారెడ్డి, శేషన్న పాల్గొన్నారు.

గంగాభవాని ఆలయ ఆర్చ్ ప్రారంభం


ఆర్చీ ప్రారంభోత్సవంలో భక్తులు

పెద్దకడబూరు: చిన్నతుంబళం పంచాయతీ బాపురం గ్రామంలోని గంగాభవాని ఆలయ ఆర్చ్‌ని బుధవారం ప్రారంభించారు. ఆదోని–మంత్రాలయం ప్రధాన రహదారిలో చిన్నతుంబళం బస్ స్టాప్ వద్ద ఆర్చీ ఏర్పాటు చేశారు. ఆలయ పీఠాధిపతి బసలింగమ్మవ్వ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వై.ప్రదీప్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాముడు, ఎల్లప్ప పాల్గొన్నారు.


బసలింగమ్మవ్వ ఆశీస్సులు పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కౌతాళంలో వైభవంగా దేవర

కౌతాళం: మండల కేంద్రంలో మారెమ్మవ్వ దేవరను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిదేళ్ల తర్వాత ఉత్సవం జరగడంతో కౌతాళంలో సంబరాలు మిన్నంటాయి. రాత్రి 12 గంటల తర్వాత రాచమ్మగారి రాగమ్మ ఇంటి నుంచి మేటి కుంభం బయలుదేరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున 4గంటలకు రాగమ్మ ఇంటి నుంచి మరోసారి కుంభాలు బయలు దేరి మారెమ్మవ్వ, సుంకలమ్మవ్వ, రామక్కమ్మవ్వల దేవాలయాలకు చేరి పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన నాయకుడు ప్రదీప్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ బుజ్జిస్వామి, పార్టీ మండల కన్వీనర్ ప్రహాల్లదచారి, సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, కమిటీ నిర్వహకులు రాఘవేంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ అవతారం, కోఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, వడ్డెరాము పాల్గొన్నారు.


పూజలందుకుంటున్న మారెమ్మవ్వ

పౌష్టికాహారంపై అవగాహన

కోసిగి: క్రమం తప్పకుండా పౌష్టకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని స్త్రీ శిశు సంక్షేమశాఖ సూపర్‌వైజర్ కాత్యాయని అన్నారు. బుధవారం కోసిగి మండలంలోని చిర్తనకల్లు, కొల్మాన్‌పేట గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు గర్భిణులు తప్పకుండా ఆకు కూరలు, పండ్లు, గుడ్లు, చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. బాలింతలు పిల్లలకు 6 నెలల వరకు తల్లి పాలే పట్టాలని సూచించారు. ప్రభుత్వం అందించే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మార్కెట్‌యార్డుకు పోటెత్తిన మిర్చి

- 3,579 మిర్చి బస్తాల దిగుబడిని తెచ్చిన రైతులు
- డిసెంబర్ నుంచి ఇదే అధికం

ఆదోనిఅర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో గతేడాది డిసెంబర్ 13న మిర్చి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. నాటి నుంచి 2వేల బస్తాల వరకు దిగుబడి వచ్చేది. అయితే బుధవారం ఎండి మిర్చి 3579 బస్తాల దిగుబడి వచ్చిందని అధికారులు తెలిపారు. దిగుబడి, రైతులతో మార్కెట్ కిటకిటలాడింది. ఇందులో బ్యాడిగి రకం గరిష్ట ధర రూ.13వేలు, కనిష్ట ధర రూ.4,319, కడ్డీ బ్యాడిగి గరిష్ట ధర రూ.10,355, కనిష్ట ధర రూ.4,069, డీలక్స్ రకం గరిష్ట ధర రూ.9,009, కనిష్ట ధర రూ.3,229, లాలీ రకం గరిష్ట ధర రూ.8,139, కనిష్ట ధర రూ.4,129, తేజ రకం గరిష్ట ధర రూ.15,300, కనిష్ట ధర రూ. 4,509, సింజెంట రకం గరిష్ట ధర రూ.11,559, కనిష్ట ధర రూ.4,200, డీడీ రకం రూ.12,508, కనిష్ట ధర రూ. 4,269, సూపర్–10 రకం గరిష్ట ధర రూ.10 వేలు, కనిష్ట ధర రూ.4,009, రూ.5,531 రకం గరిష్ట ధర రూ.9,050, కనిష్ట ధర ర.3,529, పటాస్ రకం గరిష్ట ధర రూ.8,009, కనిష్ట ధర రూ.3,829, త్రివేణి రకం గరిష్ట ధర రూ.7,979, కనిష్ట ధర రూ. 4 వేలుగా నమోదయ్యిందని చెప్పారు. ప్రతి వారం రైతులు పెద్ద ఎత్తున ఎండుమిర్చి దిగుబడులను యార్డుకు తీసుకొస్తున్నారని, వాటికి గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.


ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు వచ్చిన మిర్చి దిగుబడులు

చలివేంద్రం ఏర్పాటు

ఆదోనిటౌన్: సాయిజ్యోతి నేత్ర దాన ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రెండు చలివేంద్రాలను రాజగోపాల్, కుటుంబ సభ్యులు, తరుణ్ మోటార్స్ బ్రదర్స్ వారి సహకారంతో ఏర్పాటు చేశారు. పట్టణంలోని పీఎన్ రోడ్డు యస్.రాజగోపాల్ షాప్ ముందు, అలాగే తరుణ్ మోటార్స్ హీరో షోరూం ఎదుట మరొకటి ఏర్పాటు చేశారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నేడు గంగాభవాని రథోత్సవం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెద్దకడబూరు: చిన్న తుంబళం మజార గ్రామమైన బాపురంలో శ్రీగంగాభవాని రథోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు తెలిపారు. మఠం పీఠాధిపతి బసలింగమ్మవ్వ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, గంగాపూజ, గణారాధన, కుంభ తీర్థం తదితర పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం నంది కోలసేవ, రథోత్సవం ఉంటుందని తెలిపారు.

గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

ఆదోనిటౌన్: సబ్‌డివిజన్ పరిధిలోని భారత్‌గ్యాస్ వినియోగదారులు ఈనెల ఆఖరులోగా ఈ-కేవైసీ తప్పకుండా చేయించుకోవాలని ఆదోని భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు సందీప్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఏజెన్సీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్యాస్ వినియోగదారులు ప్రతిఒక్కరూ ఈ-కేవైసీ చేయించుకొని ప్రభుత్వం నుంచి అందే సబ్సిడీని పొందాలని కోరారు. వినియోగదారులకు గ్యాస్ బుకింగ్ కావాలన్నా, సబ్సిడీ మొత్తం పొందాలన్నా ఈ-కేవైసీ చేయించుకోవడం తప్పనిసరన్నారు. ఈనెల 31వ తేదీకి గడువు ముగుస్తుందని, గ్యాస్ డెలివరీ వాహనం వద్ద లేదా ఏజెన్సీ కార్యాలయం వద్ద ఈ-కేవైసీని చేయించుకోవచ్చని చెప్పారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు వినియోగదారులకు సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

15న వాహనాల వేలం

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 15వ తేదీన వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలాల్లో పాల్గొనే వారు ఉదయం ఆధార్, పాన్ కార్డులతో వాహనానికి సంబంధించి 10 శాతం అమౌంట్ డిపాజిట్ చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వై సీతారామిరెడ్డి, మహిళలు, సమావేశానికి హాజరైన మహిళలు

మంత్రాలయం: వివిధ సంక్షేమ పథకాలతో మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని టీటీడీ పాలక మండలి సభ్యుడు వై. సీతారామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, స్త్రీ నిధి పథకం కింద నిధుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద 726 గ్రూపులకు రూ.3.54కోట్లు, నాల్గో విడత వైఎస్సార్ చేయూత కింద 3606 మందికి రూ.6,76,12,500 మంజూరు అయ్యాయని తెలిపారు. స్త్రీనిధి కింద 500 మంది లబ్ధిదారులకు రూ.3.02కోట్లు మెగా చెక్కులను మహిళలకు పంపిణీ చేశారు. ఈ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అనంతరం మహిళలతో కలిసి సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునెప్ప, ఏపీఎం జయశ్రీ, రిటైర్డ్ తహసీల్దార్ వర్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు భీమా రెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య పాల్గొన్నారు.

జోరుగా తాగునీటి పైప్‌లైన్ పనులు

కౌతాళం: గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎరిగేరి సర్పంచ్ గోవిందు అన్నారు. ఎరిగేరి గ్రామంలోని జంగాల కాలనీలో తాగునీటి సమస్య ఉండడంతో విషయాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన ఆయన మండల పరిషత్ నిధుల నుంచి రూ. 5 లక్షలు విడుదల చేయించారన్నారు. దీంతో పైప్‌లైన్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఓహెచ్ఆర్ ట్యాంకు నుంచి జంగాల్ కాలనీకి తాగునీరు అందించడానికి రూ. 5 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణ పనులను చేపట్టినట్లు వెల్లడించారు. నాలుగు రోజుల్లో పనులు పూర్తి చేసి కాలనీకి తాగునీరు అందించే ఏర్పాటు చేస్తామన్నారు.


ఎరిగేరిలో జరుగుతున్న పైప్‌లైన్ పనులు

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: మండల పరిధిలో డీటీఎఫ్ సీఐ నర్సానాయుడు, ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం విస్తృత తనిఖీలు చేశారు. చిర్తనకల్లు గ్రామ శివారులో కోసిగికి చెందిన రామకృష్ణ బైక్‌పై 1440 టెట్రా మద్యం బాటిళ్లు తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు వారు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని కోసిగి సెబ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.


పట్టుబడిన మద్యం బాటిళ్లతో డీటీఎఫ్ సీఐ, ఎస్ఐ

ఎన్నికల నియమావళిపై అవగాహన ఉండాలి

ఆదోనిరూరల్: రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నియమావళిపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియామవళిపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, సబ్‌కలెక్టర్, ఆదోని ఎన్నికల అధికారి శివనారాయణశర్మ నియోజకవర్గ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎన్నికలకు సంబంధించిన విధానాలు, నియామాలపై కేవలం రిటర్నింగ్ అధికారులకు మాత్రమే కాకుండా రాజకీయ పార్టీలకు, మీడియా ప్రతినిధులకు కూడా స్పష్టత ఉండాలనే ఉద్దేశంతో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తేదీ, ఎన్నికల నోటిఫికేషన్ తేదీ వేర్వేరుగా ఉంటుందన్నారు. నోటిఫికేషన్ తేదీ నుంచి నామినేషన్లు వేసుకోవచ్చని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ తేదీన ఉదయం 11 గంటలకు నోటిఫికేషన్‌ను పబ్లిష్ చేస్తామని, ఆ వెంటనే నామినేషన్‌లు వేసుకోవచ్చన్నారు. రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నోటీసు బోర్డు, ఇతర ప్రముఖ ప్రభుత్వ కార్యాలయాల్లో నోటిఫికేషన్‌ను బోర్డులో ప్రదర్శిస్తామని తెలిపారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో కాన్వాయ్‌లో కేవలం మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తామన్నారు. రిటర్నింగ్ అధికారి చాంబర్ నుంచి 100 మీటర్ల దూరంలో వాహనాలను నిలిపి వేయాలని సూచించారు. నామినేషన్ చేసే అభ్యర్థితో పాటు నలుగురు వ్యక్తులు మాత్రమే ఆర్‌ఓఎస్, ఏఆర్‌ఓల కార్యాలయంలోకి ప్రవేశించడానికి అనుమతి ఉంటుందన్నారు. సెక్యూరిటీ డిపాజిట్‌కి సంబంధించి అభ్యర్థులు నామినేషన్ చేసే సమయంలో అసెంబ్లీ ఎన్నికలకు రూ.10 వేలు, సెక్యూరిటీ డిపాజిట్ నగదు రూపంలోనైనా, ట్రెజరీ రిసిప్ట్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు పబ్లిక్ నోటీసులో తెలిపిన ప్రదేశాల్లోనే నామినేషన్లు దాఖలు చేయాలని, అలాగే నామినేషన్లను పని దినాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటలకు 5 నిమిషాల ముందు బయట ఎంతమంది అభ్యర్థులు ఉంటే వారందరికీ స్లిప్పులు ఇచ్చి నామినేషన్ వేయించే అవకాశం కలిప్తామని స్పష్టం చేశారు. గుర్తింపు పొందిన పార్టీలకు అయితే అభ్యర్థి, లేదా ఆయన తరఫున అదే నియోజకవర్గానికి చెందిన ప్రపోజర్ నామినేషన్ వేయచ్చని, రిజిస్టర్డ్ పార్టీ, స్వతంత్ర్య అభ్యర్థులకు సంబంధించి 10 మంది ప్రపోజర్లు ఉండాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన పార్టీలు, ఇక్కడ గుర్తింపు పొందిన ఎడల రిజిస్టర్డ్ పార్టీగా పరిగణించబడుతుందన్నారు. అభ్యర్థులను నామినేషన్ ఫైల్ చేసిన సమయంలో డాక్యుమెంట్లు జతపరిచినట్లయితే ఒక నామినేషన్ దాఖలుకు చివరి తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించాలని, లేకపోతే నామినేషన్ తిరస్కరిస్తామన్నారు. అర్థమయ్యే రీతిలో అఫిడవిట్ ఉండాలన్నారు. అభ్యర్థులు తమ అఫిడవిట్‌లో తప్పులు పొందుపరిస్తే రిటర్నింగ్ అధికారులది బాధ్యత కాదన్నారు. వాటి మీద విచారణ చేసే బాధ్యత ఆర్వోలకు ఉండదన్నారు. అభ్యర్థులు గత 10 సంవత్సరాల్లో ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం చేసినట్లయితే ప్రభుత్వానికి ఎటువంటి బకాయిలు పెండింగ్‌లో లేవని నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు ఫాం–ఏ, ఫాం–బీ ఒరిజినల్ కాపీలను రిటర్నింగ్ అధికారులకు అందజేయల్సి ఉంటుందన్నారు. పొలిటికల్ పార్టీలు ఒకరికిచ్చిన బీ ఫార్మ్‌ను వెనక్కు తీసుకొని కొత్తవారికి ఇచ్చే అవకాశం ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో గతంలో ఇచ్చిన వ్యక్తికి విత్ డ్రా చేస్తున్నామనే ఆర్డర్ కూడా ఉండాలన్నారు. ఎన్నికల ప్రకటన రాగానే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఓటర్లను మతపరంగా గానీ, కులాల పరంగా ఓట్లు అడిగినా, ఇతర అభ్యర్థుల ప్రచారానికి భంగం కలిగించినా ఎంసీసీ నియమాలను ఉల్లంఘించినట్లేనన్నారు. ప్రతి అభ్యర్థికీ ఓటర్లను ఓటు అడగడానికి ప్రచారాలు, పబ్లిక్ సమావేశాలు నిర్వహించుకోవడానికి సమానంగా అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. అభ్యర్థులు చేసే ఖర్చును మానిటర్ చేస్తామని, పార్టీలు వారికి సంబంధించిన స్టార్ క్యాంపెయినర్ పేర్ల జాబితా ఇవ్వాలని కోరారు. ఇందుకు వారికి సంబంధించిన ఖర్చులను కూడా లెక్క వేస్తామన్నారు.వాహనాలను చెకింగ్ చేసే సమయంలో ఏ వాహనంలోనైనా రూ.50 వేలకు మించి డబ్బులు ఉంటే వాటికి సంబంధించిన డాక్యుమెంట్‌లు చూపించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినీత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ

సెక్టోరియల్ అధికారులకు శిక్షణ

ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమైనదని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల విధులపై సెక్టోరియల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలకు గానూ 26 మంది సెక్టోరియల్ ఆఫీసర్లు, ఇద్దరు రిజర్వ్ కలిపి 28 మందిని నియమించామని చెప్పారు. సెక్టోరియల్ అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ సామగ్రి, చేయాల్సిన, చేయకూడని, చెక్ లిస్ట్, హ్యాండ్ బుక్‌లపై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి వసతుల లోటుపాట్లు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆదోని తహసీల్దార్, ఏఈఆర్‌ఓ హసీనా సుల్తానా, డీఎల్‌పీఓ కార్యాలయం పరిపాలనాధికారి, ఏఈఆర్‌వో వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.